క్లుప్తంగా

వరాహ, నరసింహ అవతారాల్లో జగన్నాథస్వామి



గుండిచా మందిరంలో పూజలు అందుకుంటున్న స్వామివారు

బలిజిపేట: జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు మంగళవారం స్వామివారిని వరాహ, నరసింహ అవతారాల్లో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు ఆర్.పార్థసారథి ఆచార్యులు, సురేష్‌లు గుండిచా మందిరం వద్ద స్వామివారికి అవతారాలను మార్పుచేసి పూజాకార్యక్రమాలు చేశారు. ధూపదీప నైవేద్యాలతో స్వామివారికి పూజల అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామిని దర్శించుకున్నారు.

ఎస్‌బీఐలో బ్యాంకు డే సంబరాలు



స్టేట్ బ్యాంకు మెయిన్‌బ్రాంచి వద్ద నిర్వహిస్తున్న సంబరాలు

సాలూరు: పట్టణంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మెయిన్‌బ్రాంచ్ బ్యాంకు 7దశాబ్దాలు పూర్తిచేసుకున్న నేపథ్యంలో మంగళవారం బ్యాంకు డే సంబరాలు నిర్వహించారు. బ్యాంకు చీఫ్ మేనేజర్ పి.అనీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బందితో పాటు బ్యాంకు వినియోగదారులతో కలిసి సంబరాలు నిర్వహించి కేక్ కట్‌చేశారు.

మలేరియా మహమ్మారిని కట్టడి చేయండి



జిల్లా మలేరియా అధికారిణి వై.మణికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పార్వతీపురంటౌన్: జిల్లాను వణికిస్తున్న మలేరియా మహమ్మారిని కట్టడి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా మలేరియా అధికారిణి వై.మణికి జిల్లాలో విజృంభిస్తున్న మలేరియా నివారణ కోసం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు ప్రారంభమయ్యాయని, దోమల బెడద కూడా ఆరంభమైందన్నారు. ఇప్పటికే పలుచోట్ల మలేరియా విజృంభించిందని, తక్షణమే రెండో విడత మలేరియా నివారణ మందుల పిచికారీ చేయాలని కోరారు. గ్రామాల్లో మలేరియా వైద్య శిబిరాలు నిర్వహించాలని, డెంగీ పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కోలా కిరణ్ కుమార్, మండల అధ్యక్షుడు తీళ్ల గౌరీ శంకరరావు పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టిసారించాలి



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ మజ్జి శోభారాణి

పార్వతీపురం రూరల్: మండలంలోని పంచాయతీల్లో ఉన్న సమస్యలపై సంబంధిత అధికారులు దృష్టిసారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పార్వతీపురం ఎంపీపీ మజ్జి శోభారాణి అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలకు సంబంధించిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై అలసత్వం లేకుండా పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా అందించాల్సి ఉందన్నారు. మండలస్థాయిలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో సూర్యఘర్ వినియోగంపై అధికారులు నాయకులకు వివరించి అవగాహన కల్పించారు. గ్రామాల్లో సూర్యఘర్ సబ్సిడీ ద్వారా ఏర్పాటు చేసుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని అధికారులు కోరారు. అలాగే రావికోన సర్పంచ్ సమావేశంలో మాట్లాడుతూ తమ గ్రామానికి వెలుగు వీఓఏను ఏర్పాటు చేయాలని, అలాగే గతంలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు విడుదలయ్యేందుకు ప్రజా పరిషత్ కార్యాలయ అధికారులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సిద్ధా జగన్నాథం, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీ

సాలూరు: పట్టణంలోని పీఎన్‌బొడ్డవలసలో గల డా.బీఆర్‌అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.తిరుపతిరావు ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరంలో 4వ తరగతి చదివి 5వ తరగతిలో ప్రవేశం కోసం ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. 2025 మార్చిలో పదవ తరగతి పాసైన విద్యార్థులు ఈ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులతో కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

కాలువలు ఇలా.. సాగునీరెలా..?

- పిచ్చిమొక్కలతో నిండిపోయిన కాలువలు
- జైకానిధులు విడుదలకాక, నిలిచిపోయిన పనులు
- మరమ్మతుల బారిన షట్టర్లు
- ఉపాధి వేతనదారులతో పిల్ల కాలువల్లో పూడికల తొలగింపు



కొండబుచ్చమ్మపేట, శాంతేశ్వరం గ్రామాలకు సరఫరాచేసే షట్టర్ మరమ్మతుల బారిన పడిన దృశ్యం

మక్కువ: తొలకరి పలకరించింది. వర్షాలు కురుస్తుండడంతో, అన్నదాతలు ఖరీఫ్‌సాగుకు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే నారుమడులు తయారుచేసి, పొలాలు బాగుచేసే పనుల్లో బిజీగా ఉన్నారు. మరో నెలరోజుల్లో ఉభాలు ప్రారంభమయ్యే అవకాశముంది. కాలువల్లో పూడికలు ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. దీంతో శివారు గ్రామాల పంటపొలాలకు సాగునీరు ఏమేరకు అందుతుందోనన్నది ప్రశార్థకంగా మారింది. దీనికితోడు జైకా నిధులతో జరిపించాల్సిన ప్రధానకాలువల పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. జైకా నిధులతో కాలువల లైనింగ్, పూడికతీత, షట్టర్ల మరమ్మతులు చేయాల్సి ఉంది. నిధులు మంజూరుకాకపోవడంతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోగా రైతులు ఆందోళన చెందుతున్నారు.

24,700 ఎకరాలకు సాగునీరు అందేనా?

మక్కువ, సీతానగరం, బొబ్బిలి మండలాలకు చెందిన 24,700 ఎకరాలకు వెంగళరాయ సాగర్ ప్రాజెక్ట్ నుంచి సాగునీరు అందాల్సి ఉంది. గత ప్రభుత్వం హయాంలో జైకా నిధులతో ఆర్‌ఎంసీ (కుడిప్రధానకాలువ) పరిధిలో కొంతమేరకు కాలువల లైనింగ్, సువర్ణముఖి నది, గోముఖినది రెగ్యులేటర్ల గేట్లు ఏర్పాటుచేయడం వంటి అభివృద్ధి పనులు జరిపించారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు నిధులు అందకపోవడంతో, జైకా నిధులతో చేపట్టాల్సిన మిగిలిన పనులు నిలిచిపోయాయి. దీంతో ప్రధాన కాలువల ద్వారా పంటపొలాలకు అందాల్సిన సాగునీరు ఈ ఏడాది ఎంతమేరకు అందుతుందోనని రైతులు తలలు పట్టుకుంటున్నారు.



ఆర్‌ఎంసీ 12ఎల్ కాలువలో పేరుకుపోయిన సిల్ట్

ఓఅండ్‌ఎం, ఎస్‌డీఎంఎఫ్ నిధులతో పనులు

వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ పరిధిలో ఓఅండ్‌ఎం (ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్) నిధులు సుమారు రూ.25లక్షలతో 6పనులు చేపట్టారు. వాస్తవానికి వీఆర్‌ఎస్ ప్రాజెక్ట్ పరిధిలో సుమారు 30 కాలువల్లో మెయింటనెన్స్ పనులు జరిపించాల్సి ఉంది. అందుకోసం 30పనులు అవసనరమున్నట్లు ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపించినప్పటికీ, కేవలం 6పనులు మాత్రమే మంజూరయ్యాయి. సంబంధిత పనులు నిర్వహిస్తున్నప్పటికీ ఇంతవరకు నిధులు మంజూరుకాలేదు. అలాగే ఎస్‌డీఎం (స్టేట్ డిజాస్టర్ మెటిగేషన్) నిధులు సుమారు రూ.73లక్షలతో 19పనులు మంజూరు కాగా, వాటిలో 12పనులు పూర్తయ్యాయి. మరో మూడుచోట్ల పనులు చేస్తున్నారు. ఇంకా నాలుగు చోట్ల పనులు ప్రారంభం కాలేదు. ఎస్‌డీఎంఎఫ్ నిధులతో జరిపించిన 12పనులకు సంబంధించి ఇంతవరకు ఒక్కరూపాయి విడుదల కాలేదు. జైకా నిధులు పూర్తిస్థాయిలో విడుదలచేసి, వీఆర్‌ఎస్ ప్రాజెక్ట్‌ను ఆధునీకరణ చేస్తే కానీ పూర్తిస్థాయిలో సాగునీరు అందే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ఈ విషయంపై వీఆర్‌ఎస్ డీఈఈ సురేష్‌ను వివరణ కోరగా, జైకా నిధులతో ప్రధాన కాలువల మరమ్మతులు చేయాల్సి ఉండగా, జంగిల్ క్లియరెన్స్ జరిపించ లేదన్నారు. జైకా నిధుల కోసం ప్రతిపాదనలు పంపించామని కొద్దిరోజుల్లో వచ్చే అవకాశముందన్నారు. వచ్చిన వెంటనే ప్రధాన కాలువల్లో జంగిల్స్ క్లియర్ చేస్తామని తెలిపారు. అలాగే మిగిలిన కాలువల్లో పూడికతీత పనులు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా, ఓఅండ్‌ఎం నిధులతో జరిపిస్తున్నామన్నారు. కాలువల్లో షట్టర్ల ఏర్పాటుకు డిజైన్ కోసం పంపిచామని ఆయన తెలిపారు.



పిచ్చి మొక్కలతో కాలువలు

తుప్పలు,డొంకలతో పేరుకుపోయిన 9ఎల్ కాలువ

ఆర్‌ఎంసీ ప్రధానకాలువలో పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. అలాగే ఎల్‌ఎంసీ కాలువ పరిధిలోని, ఎల్‌బీసీ 9ఎల్, 13ఎల్ కాలువల్లో రెండునెలల క్రితం పూడికలు తొలగించే పనులను ఇరిగేషన్ అధికారులు చేపట్టారు. అయినప్పటికీ కాలువల్లో పిచ్చిమొక్కలు యథాతథంగా పెరగడంతో, కాలువలు గుర్తించలేని విధంగా మారిపోయాయి. రెండునెలల ముందుగా కాకుండా, ఖరీఫ్ సాగుకు ముందు కాలువల్లో పూడికలు తొలగించిఉంటే, ఈపరిస్థితి తలెత్తిదికాదని రైతులు వాపోతున్నారు. ఇంతలా కాలువల్లో పిచ్చిమొక్కలు పేరుకుపోతే, పొలాలకు సాగునీరు ఏవిధంగా అందుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. అలాగే ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు సైతం జైకా నిధులతోనే చేయాల్సి ఉండడంతో, ఈ ఏడాది ప్రధాన కాలువల్లో పూడికలు తీసే పనులు జరిగే అవకాశం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువల్లో పూడికలు తొలగించకపోతే సాగునీరు ప్రశార్థకంగా మారుతుందని రైతులు అంటున్నారు.



పూడికలతో నిండిపోయిన 13ఎల్ కాలువ

అన్నదాత సుఖీభవ ఎక్కడ?

- ఏపీ రైతు సంఘం ప్రశ్న



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా నాయకుడు రెడ్డి ఈశ్వరరావు

సీతానగరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం ఆర్థిక సహాయం ఎక్కడని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు రెడ్డి ఈశ్వరరావు ప్రశ్నించారు. ఈ మేరకు మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏపీ రైతు సంఘం నాయకులు ఆర్.ఈశ్వరరావు, బి.అప్పారావు, ఎం.సింహాచలం మంగళవారం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకోసం ఇస్తామన్న రైతు భరోసా పథకం ఖరీఫ్‌సీజన్ ఆరంభంలోనే రైతుల బ్యాంక్ ఖాతాలకు పీఎం కిసాన్, రైతుభరోసా కింద ఆర్థిక సహాయం జమచేసిందన్నారు. రైతుభరోసా పథకాన్ని కూటమి ప్రభుత్వం పేరు మార్చి అన్నదాత సుఖీభవ పథకం ప్రవేశ పెట్టిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఖరీఫ్ సీజన్ సమయానికి పెట్టుబడి నిధిగా రైతుల బ్యాంక్ ఖాతాలకు మే నెల లేదా జూన్ మొదటి వారంలో జమచేయనున్నట్లు కూటమి పాలకులు హామీ ఇచ్చిన మేరకు నిధులు జమచేయకుండా తాత్సారం చేయడం దురదృష్ట కరమన్నారు. అలాగే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో పంపిణీ చేయకపోవడంతో ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలు అమలు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



సీహెచ్‌ఓ ఎస్వీ రమణకు సమ్మె నోటీస్ ఇచ్చిన ఆశవర్కర్లు

సీతానగరం: గ్రామాల్లో నామమాత్రమైన వేతనాలతో నిరంతరం సేవలందిస్తున్న ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు నిరసనగా ఈ నెల 9న నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయడానికి సహకరించాలని వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బైరిపూడి పద్మ, జి.పాప కోరారు. ఈ మేరకు స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం సీఐటీయూ జిల్లా నాయకుడు జి.వెంకటరమణ ఆధ్వర్యంలో సీహెచ్‌ఓ ఎస్వీ రమణకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్‌కోడ్ రద్దు చేయాలి. శ్రమకు తగిన గౌరవ వేతనం రూ.26 వేలు ఇవ్వాలి. ఒప్పంద జీవో అమలు చేయాలని, గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. మండలంలోని ఉన్న ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జూలై 9న జరగ నున్న సమ్మెకు వామపక్ష భావాలు గల వారంతా మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

సాగు చేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలి

- సీపీఎం నాయకుడు పి. రాము



తహసీల్దార్ కార్యాలయం వద్ద సీతంపేట గిరిజన గ్రామస్తులతో సీపీఎం నాయకుడు పి.రాము

పార్వతీపురం రూరల్: మండలంలోని సంగంవలస పంచాయతీ సీతంపేట గ్రామంలో గిరిజన రైతులు సాగు చేస్తున్న భూములకు జాయింట్ సర్వే చేసి పట్టాలు మంజూరు చేయాలని సీతంపేట గిరిజన గ్రామస్తులతో కలిసి పార్వతీపురం మండల సీపీఎం నాయకుడు పి.రాము మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సమస్యను విన్నవించారు. జాయింట్ సర్వే ప్రారంభించి సర్వే జరుగుతుండగా తహసీల్దార్ బదిలీ కావడంతో సర్వే నిలిచిపోయిందని, ఎన్నోమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకుని సర్వే నిర్వహించడం లేదన్నారు. ఈ మేరకు సమస్యలతో వివరణతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు.

ఫిర్యాదులు ఇవ్వడమే మిగిలింది

- నేటికి ఏడు సార్లు ఫిర్యాదు
- పట్టించుకోని అధికారులు
- ఓ మహిళ ఆవేదన



తహసీల్దార్ కార్యాలయం వద్ద సీదరపు కాంతమ్మ

పార్వతీపురం రూరల్: తన హక్కు, అనుభవంలో ఉన్న భూమిని సర్వేలో వేరే రైతు పేరున ఆన్‌లైన్ 1–బీలో నమోదు చేయడంతో, తప్పుగా నమోదైన భూమిని తన పేరున వన్ బీ పాస్‌పుస్తకాలను జారీ చేయాలని అధికారుల చుట్టూ పలుమార్లు కాళ్లరిగేలా తిరిగినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆ గిరిజన మహిళ ఆవేదన చెందింది. ఇటీవల బదిలీల ప్రక్రియలో పార్వతీపురం తహసీల్దార్‌గా కొత్తవారు రావడంతో ఆశ చావక మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని తన సమస్యను మరోమారు కొత్తగా వచ్చిన తహసీల్దార్‌కు విన్నవించేందుకు విచ్చేసింది. పార్వతీపురం మండలం గోచెక్క గ్రామానికి చెందిన సీదరపు కాంతమ్మ తన భర్త సన్యాసయ్యదొర ద్వారా సంక్రమించిన సుమారు 1.55 ఎకరాల భూమిలో కుటుంబసభ్యులం జీడి, టేకు, మామిడి తోటలను పెంచి వాటి ఫలసాయాలతో జీవనం సాగిస్తున్నాం. ఇదిలా ఉండగా తన భర్త సన్యాసయ్యదొర 1978లో క్రయ చీటీ ద్వారా మావుడి కాశినాయుడు కుటుంబసభ్యుల నుంచి సర్వే నెంబర్ 41/1 ఎకరా 1.70 సెంట్లు భూమిని కొనుగోలు చేసి పంటలను సాగు చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాం.

మా భూమి మాకు తెలియకుండానే ఆన్‌లైన్

రీ సర్వే జరగడానికి ముందే గ్రామ వీఆర్‌ఓ జి.మనోజ్ కుమార్ 1బి, పట్టాదారు పాస్ బుక్ ఇస్తామని చెప్పి, రీ–సర్వే సమయంలో మాకు తెలియకుండా మేము సాగు చేస్తున్న భూమిని మజ్జి కృష్ణ, శశిభూషణరావు, సావిత్రమ్మ, లక్ష్మి పేర్లు మీద 1–బి, పట్టాదారు పాసుపుస్తకాలను తయారు చేసి ఇచ్చినట్లు పేర్కొన్నారు. మేము సాగు చేస్తున్న, మా అనుభంలో ఉన్న భూమిని మాకు తెలియకుండా ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. మా హక్కు అనుభవంలో ఉన్న భూమిని పాస్ పుస్తకాల్లో తప్పుగా నమోదు చేసిన వారి పేర్లను తొలగించి తన పేరున పాస్‌పుస్తకాలను మంజూరు చేయాలని సీదరపు కాంతమ్మ పలుమార్లు అధికారులను కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయపరమైన తన సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.

విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాలు



విద్యార్థినులకు నగదు ప్రోత్సహకాల్ని అందజేస్తున్న హెచ్‌ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి

సీతానగరం: మండల కేంద్రంలోని ఉన్నతపాఠశాలలో 2024–25 విద్యాసంవత్సరంలో టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు బంకా శ్రావణితో పాటు మరో ముగ్గురికి దాతలు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేయడం అభినందనీయమని హెచ్‌ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి అన్నారు. ఈ మేరకు స్థానిక ఉన్నతపాఠశాల ఆవరణలో మంగళవారం దివంగత అయ్యగారి వెంకటనరసింహం(సుప్రీం కోర్టు జడ్జి)జయంతిని పురస్కరించుకుని విశ్రాంత ప్రొఫెసర్ అయ్యగారి ఆనంద్ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో అభినందనసభ జరిగింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఉన్నత పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధిని ప్రోత్సహిస్తూ ఉన్నతపాఠశాలలో టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు పలువురు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సహోపాధ్యాయులు బి.మాధవి, బి.రాధ, ఐ.పద్మావతి, వి.ప్రమీల, జి.విజయలక్ష్మి, సుభద్రమ్మ, రేణుకాదేవి పాల్గొన్నారు.

మరోపోరాటం తప్పదు



సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు తదితరులు

సాలూరు: గత సమ్మెకాలంలో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన ఒప్పందాలను అమలుచేయకుంటే మరోపోరాటం తప్పదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వైనాయుడు, యూనియన్ పట్టణ అధ్యక్షుడు తుపాకుల రాముడులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టాలని యూనియన్ ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం సాలూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో 17 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం తరపున అధికారులు చేసుకున్న మినిట్స్ ఒప్పందాలకు జీఓలు విడుదలచేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ కార్మికులు నలుగురు మరణించారని , వారికి రావాల్సిన నష్టపరిహారం నేటికీ ఇవ్వలేదు. వారి కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వలేదని, వెంటనే ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, మున్సిపాలిటీలో పెరిగిన జనాభాకు తగ్గట్టుగా కార్మికుల సంఖ్యను పెంచాలని, పనిముట్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధపడతామని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో నాయకులు పోలరాజు, రవి, స్వప్న, శ్రీను, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వరి నారుమడులకు సమయం



రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ శిరీష

సాలూరు రూరల్: ప్రస్తుతం రైతులు వరినారుమడులు, వెదజల్లుకోవడానికి అనుకూలమైన సమయమని ఏఓ శిరీష అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె మండలంలోని మామిడిపల్లి, అన్నం రాజువలస గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలుసూచనలు సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం మొక్కజొన్నలో కత్తెర పురుగు వస్తుందని దాని నివారణకు ఎమమెక్టిన్ బెంజాయిట్ 80 గ్రాములు లేదా స్పైనోసైడ్ 60 యంఎల్ ఎకరాకి పిచికారీ చేయాలని చెప్పారు. అలాగే నారుమడులు వేసిన రైతులు నారు మొలిచిన వారం రోజుల తరువాత డీఏపీ 1.5 కిలోలు రెండు దఫాలుగా వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు శ్రీను, తిరుపతిరావు వీఏఏ సంధ్య పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాలి



మరిపివలసలో గ్రీన్ అంబాసిడర్లకు సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ ప్రసాద్

సీతానగరం: గ్రామాల్లోని గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటా ట్రైసైకిళ్ల ద్వారా సేకరిస్తున్న తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసి ఎస్‌డబ్ల్యూపీసీల్లో శుద్ధి చేసి ఎరువు తయారీకి సిద్ధం చేయాలని ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమారవర్మతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ట్రై సైకిళ్ల ద్వారా గ్రీన్ అంబాసిడర్లు ప్రతిరోజూ తెల్లవారుజామున సేకరించే తడి పొడి చెత్తను వేరు చేసి ఎస్‌డబ్ల్యూపీసీల్లో వర్మీకంపోస్టు తయారు చేయడానికి కార్యదర్శులు సమాయత్తం కావాలని సూచించారు. ప్రతి గ్రామంలో చెత్తను సేకరించే పనులు చేపట్టాలని తద్వారా పారిశుధ్య పనులు చేపట్టడం, చెత్తనుంచి సంపద తయారీకి దోహద పడుతుందన్నారు. ఇప్పటికే సూరంపేట, మరిపివలస, నిడగల్లు,పెద భోగిలి తదితర గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్య ప్రైవేటీకరణ కోసమే పాఠశాలల ఎత్తివేత?

సాలూరు: విద్యను ప్రైవేటీకరణ చేయడం కోసమే విలీనం పేరుతో గ్రామాల్లో పాఠశాలలను ఎత్తివేస్తున్నారని ఆరోపిస్తూ, ప్రభుత్వ చర్యను రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప ప్రకాశరావు వ్యతిరేకించారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను సుందరీకరణ చేశారన్నారు. నేటి కూటమి పాలనలో గ్రామాల్లో పాఠశాలలే లేకుండా తరలించడం భావ్యం కాదని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మెడికల్ కళాశాలలు ఏర్పాటుచేస్తే , వాటిని కూడా టీడీపీ కూటమి ప్రభుత్వం నడపలేక ప్రైవేట్, కార్పొరేట్లకు అప్పగించడం, రిజర్వేషన్‌లకు గండికొట్టడమేనని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం విద్య ప్రైవేటీకరణ ఆపాలని విజ్ఞప్తి చేశారు.





జంఝావతి కాలువపై వంతెన మధ్యభాగంలో ఏర్పడిన భారీ గుంతల్లో అవస్థలు పడుతూ వెళ్తున్న వాహనాలు, వంతెన మధ్యభాగంలో ఏర్పడిన గుంతలో చేరిన వర్షపునీరు

ప్రమాదాన్ని పట్టించుకోని అధికారులు

పార్వతీపురం రూరల్: జిల్లాకేంద్రం నుంచి వెంకంపేట మీదుగా ఒడిశాతో పాటు పలు గ్రామాలకు వెళ్లేందుకు ఉన్న రహదారి గుంతలమయమై తీవ్ర స్థాయిలో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చినబొండపల్లి గ్రామశివారులో ఉన్న జంఝావతి కాలువ మీద గల వంతెనపై భారీగా రెండు గుంతలు వంతెన మధ్య భాగంలో ఏర్పడి భయాందోళన కలిస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు క్రమేణా మరింత లోతుగా గుంతలు ఏర్పడి జలమయమవుతున్నాయి. ఈ భారీ గుంతలు ప్రమాదకరంగా తయారై వాహన చోదకులను ఆందోళనకు గురిచేస్తున్నప్పటికీ సంబంధిత అధికారుల నుంచి స్పందన కరువైంది. ప్రమాదం ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులని స్థానికులు, వాహన చోదకులు ప్రశ్నిస్తున్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



ఇంటింటి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణ

మక్కువ: మండలంలోని కన్నంపేట గ్రామంలో పంచాయతీ కార్యదర్శి జరిపించిన పారిశుధ్య పనులను డిప్యూటీ ఎంపీడీవో ఎన్. సూర్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్త ఎక్కడపడితే అక్కడ వేయరాదన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిలవలేకుండా చూసుకోవాలని సూచించారు. అలాగే గ్రామంలోని మంచినీటి పథకం ట్యాంక్ వద్ద జరిపిన క్లోరినేషన్ పనులను ఆయన పరిశీలించారు. మక్కువ పీహెచ్‌సీ వైద్యాధికారి హరికృష్ణ ఆధ్వర్యంలో కన్నంపేట గ్రామంలో నిర్వహించిన మెడికల్ క్యాంప్‌ను డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణ పరిశీలించారు. ఎంపీడీవో సూర్యనారాయణ పర్యవేక్షణలో ఎ.వెంకంపేట గ్రామంలో చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ. పీఎంకే.రెడ్డి, జేఈ జోగారావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.